అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జోనల్ స్థాయిలో పెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి తమ్మిరెడ్డి యశస్విని మొదటి స్థానం సాధించింది. దీంతో విజయవాడలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యార్థికి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు.

– ప్రజాశక్తి, బొబ్బిలిరూరల్

తెలుగు మాధ్యమానికి మంగళం



మాతృభాష తెలుగుకు రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. మన మాతృ భాష తెలుగు అనే విషయాన్ని మర్చిపోయే విధంగా ప్రభుత్వం విధానాలు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో తెలుగు మీడియం లేకుండా చేసి ఇంగ్లీషునే ప్రధాన భాషగా పెట్టింది. ప్రపంచంతో పోటీ పడాలనే కారణం చూపి ఆంగ్ల మాధ్యమాన్ని బలవంతంగా మనపై ప్రభుత్వం రుద్దుతోందని పలువురు విద్యావేత్తలు, మేధావులు ఆవేదన చెందుతున్నారు. ఆ పేరుతో తెలుగు భాషను విద్యార్థులకు తెలియకుండా చేస్తున్నారని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో తెలుగు భాషా పండితులు, అభ్యుదయవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పాఠశాలల్లో ఇక తెలుగు కనుమరుగు
- ఉత్తర్వులిచ్చిన పాఠశాల విద్యాశాఖ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న భాషాభిమానులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, సిబిఎస్‌సి సిలబస్ పేరుతో గత ప్రభుత్వం తెలుగు మాధ్య మానికి తూట్లు పొడుస్తోందని గొంతెత్తి అరిచిన టిడిపి నాయకులు తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు మాధ్యమానికి మంగళం పాడేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేదంటూ, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆంగ్లం తప్పని సరి చేస్తూ విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు కలిపి సుమారుగా మూడు లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇన్నాళ్లూ తప్పనిసరిగా ఉన్న తెలుగు సబ్జెక్టును ఇంటర్ విద్యలో ఐచ్ఛికం చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడి తెలుగు అధ్యాపకులంతా ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్న రోజుల్లో తెలుగు మాధ్యమానికి అన్యాయం చేస్తున్నారని.. తెలుగులోనే బోధన, చదువులు కొనసా గాలని గగ్గోలు పెట్టిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ తీరా అధికారంలోకి వచ్చాక తమ స్వరం మార్చేశారు. తాజాగా పాఠశాల విద్యాశాఖ తెలుగు మాధ్యమం లేదంటూ ఉత్త ర్వులు ఇవ్వడం పట్ల తెలుగు భాషాభిమానులు, ఏపి రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లాశాఖ ప్రతిని ధులు, కవులు, సాహితీప్రియులు మండిపడుతున్నారు. తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాలు, కొన్ని బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మాత్రం తమ మాతృభాషకు అగ్రతాంబూలమిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం మాతృభాషను పట్టించుకోకపోవడం పట్ల ఆవేదన చెందుతున్నారు.

తెలుగు టీచర్లు లేకుండా బోధనెలా ?

ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు టీచర్లు ఉండరని పాఠశాల విద్యాశాఖ చెబుతోంది. ఈ మేరకు పునర్వ్యవస్థీకరణ జీవోలో ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు బోధకులు పాఠశాలలకు కేటాయించకుండా మార్గదర్శకాలను వెలువరించింది. అసలు ప్రభుత్వం ఉద్దేశం ఏంటో.. పాఠశాలలను, విద్యా ర్థులను విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం ఏం చేయాలని ఆలోచన చేస్తుందో అర్థంకావడం లేదని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. తాజాగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు పోస్టును ఎత్తివేయడం వారి దురుద్దేశాన్ని తేటతెల్లం చేస్తోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల తెలుగు బోధనను ఎవరు చేపడతారో ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు.

తెలుగు మీడియం లేకుండా చేయడం దారుణం

ఎందరో మహానుభావుల త్యాగం ఫలితంగా తెలుగు (మొట్ట మొదటి) భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు భాషకు విద్యారంగంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. మాతృ భాషలోనే విద్యార్థి జ్ఞానాన్ని సంపూర్ణంగా నేర్చుకుంటాడనే మానసిక శాస్త్రపరంగా రుజువు అయింది. అయినా ఈ ప్రభుత్వం తెలుగు మాధ్యమం లేకుండా చేయడం దారుణం. యుపి స్కూల్స్ లో తెలుగు భాషా ఉపాధ్యాయ పోస్ట్ కూడా లేకుండా చేయడం మాతృభాష పట్ల చిన్న చూపే అవుతుంది. 1 నుండి 10 తరగతుల వరకు తప్పకుండా తెలుగు మాధ్యమం కొనసాగాలి. యుపి పాఠశాలలకు తెలుగు ఉపాధ్యాయ పోస్ట్ కేటాయించాలి.

- గొర్లి త్రినాథరావు, అధ్యక్షులు, రాష్ట్రపోధ్యాయ సంస్థ, విజయనగరం

ఆంగ్లంలో చదవాలని నిర్బంధం తగదు



పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా సమాంతరంగా ఉండాలి. మాతృభాషలో విద్యాబోధన జరగాలి. విద్యార్థి తనకి నచ్చిన మీడియంలో చదువుకోడానికి అవకాశం ఇవ్వాలి. ఏకపక్షంగా అందరూ ఇంగ్లీషు మీడియం లోనే చదవాలని నిర్బంధం చేయడం సరికాదు.

- డి.రాము, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు, యుటిఎఫ్

పోలీసు కస్టడీకి సిరాజ్, సమీర్

ఉగ్రకుట్రలకు పాల్పడిన సిరాజ్, సమీర్‌ను వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇస్తూ విజయనగరం కోర్టు తీర్పునిచ్చింది. ఉగ్రకుట్రలపై సిరాజ్, సమీర్‌ను పోలీసులు పూర్తి స్థాయిలో విచారించే అవకాశం ఉంది. దీంతో వారి 'ఉగ్ర' ప్రణాళికలు బయట పడే అవకాశం ఉంది. పేలుళ్లకు ఉపయోగపడే వస్తువులను కొనుగోలు చేసిన కె.ఎల్.పురం, కన్యకా పరమేశ్వరి కోవెల ప్రాంతాల్లో షాపుల్లో ఎన్ఐఎ అధికారులు విచారణ చేశారు. అన్ని కోణాల్లోనూ పోలీసులు, ఎన్ఐఎ అధికారులు విచారణ చేపడుతున్నారు. డిసిసిబిలో సిరాజ్ బ్యాంక్ అకౌంట్‌కు రూ.42 లక్షలు ఎలా వచ్చాయనే వివరాలపై పోలీసులు ఆరా తీసే అవకాశం ఉంది.



సిరాజ్, సమీర్

- వారంపాటు అప్పగిస్తూ జడ్జి ఆదేశం
- మరిన్ని ఉగ్రకుట్రలు బయట పడే అవకాశం
- లోతుగా ఎన్ఐఎ విచారణ
- సిరాజ్‌కు డిసిసిబిలో బ్యాంకు ఖాతాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరంలో సిరాజ్, హైదరాబాద్‌లో సమీర్‌ను అదుపులోకి తీసుకోవడంతో ఉగ్ర కుట్ర బయటపడిన విషయం తెలిసిందే. విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ జీవితం.. ఒక సాధారణ యువకుడి ప్రయాణంలా మొదలైంది. చివరికి మతోన్మాదిగా మార్చేసింది. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, ఎస్ఐ, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతూ హైదరాబాద్‌లో 108 అంబులెన్స్ సర్వీసులో టెలీకాలర్‌గా పనిచేసేవాడు. బోయగూడకు చెందిన సయ్యద్ సమీర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అదే అతని జీవితాన్ని ఎడారిలోకి నెట్టేసింది. అక్కడే జీహాది గురించి ఇద్దరూ చర్చించుకోవడం, చివరికి మతోన్మాదిగా మారానని చెప్పడం చూస్తుంటే ప్రసంగాలతో ఉగ్రవాద సంస్థలు యువతకు ఎలా వల వేసి, ఉచ్చులోకి లాగుతున్నాయో అర్థమవుతోంది.

జీహాదిపై సమీర్ మరింత ఆకర్షితుడయ్యాడు. సిరాజ్ వరంగల్‌కు చెందిన పరహాన్ మొయిన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాదర్ వంటి మిగతా ఉగ్రవాదులతో ఏర్పడిన పరిచయాలు మరింత ముంచేశాయి. ఒమన్‌లోని హైదరాబాద్ వాసి ఇమ్రాన్ అక్రమ్ మార్గదర్శకత్వంలో పేలుడు పదార్థాల కొనుగోలు, వాటిని ఉపయోగించి ఐఇడి బాంబులు తయారీకి సిద్ధమయ్యాడంటే, ఎంతలా ఉగ్రవాదం వైపు ఆకర్షితుడయ్యాడో అర్థం చేసుకోవచ్చు. ఈ బాంబులను జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పేల్చాలని ప్రణాళిక రూపొందించేలా చేశారు.

అధునాతన సాంకేతికత

ఉగ్ర చర్యల గురించి ఎవరికీ తెలియకుండా సిరాజ్ సిగ్నల్ యాప్‌ను ఉపయోగించినట్లు సమాచారం. సిరాజ్ ఇతరులతో తరచూ ఈ యాప్ ద్వారానే చర్చించి, కుట్రలకు పన్నాగాలు పన్నాడు. సౌదీ కేంద్రంగా హ్యాండ్లర్లు వీరిద్దరితో తరచూ సంప్రదింపులు జరిపారు.

ఉగ్ర కుట్రలపై డేగ కన్ను

ఉగ్రసంస్థలు యువకులను లక్ష్యంగా చేసుకుంటూ ఆర్థికంగా ముట్టజెపుతూ ఉచ్చులోకి లాగుతున్నాయి. సిరాజ్‌కు సౌదీ నుంచే ఆర్థిక లావాదేవీలు జరిగాయని ప్రాథమికంగా ఆధారాలు సేకరించారు. సిరాజ్ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలపై దృష్టి పెట్టింది. సిరాజ్‌కు డిసిసిబిలో ఉన్న బ్యాంకు ఖాతాల్లో రూ.42 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. సిరాజ్ తండ్రికి ఇదే బ్యాంకులో లాకర్ కూడా ఉన్నట్లు గుర్తించారు. వీటిని తెరవడానికి అనుమతులు అధికారులు కోరారు. తండ్రి, సోదరుడితోపాటు సమీప బంధువుల ఖాతాల్లోకి సిరాజ్ ఖాతాల నుంచి డబ్బులేమైనా వెళ్లాయా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఉగ్ర కుట్రలపై దర్యాప్తు సంస్థ.. ఎన్ఐఎ డేగ కన్ను పెట్టింది. సిరాజ్ పరిచయాలపైనా ఆరా తీస్తోంది. ఏ చిన్న విషయాన్నీ విడిచిపెట్టడం లేసదు. సిరాజ్ చదువుకున్న నెల్లిమర్ల, గజపతినగరం, విజయనగరం, కొత్తవలసలో విస్తృతంగా పర్యటిస్తూ వివరాలను సేకరిస్తోంది.

మరోవైపు వారం రోజులపాటు పోలీసు కస్టడీకి సిరాజ్, సమీర్‌ను అప్పగిస్తూ విజయనగరం కోర్టు తీర్పునివ్వడంతో పోలీసులు మరిన్ని వివరాలు రాబట్టే అవకాశం ఉంది.

ధర్నా చేస్తున్న ఎండియు ఆపరేటర్లు

ఎండియు వ్యవస్థను రద్దు చేయొద్దు

- కలెక్టరేట్ వద్ద ఎండియు ఆపరేటర్ల ధర్నా
- మద్దతు ప్రకటించిన సిఐటియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జూన్ 1 నుంచి ఎండియు వ్యవస్థను రద్దు చేస్తూ టిడిపి కూటమి ప్రభుత్వ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏపి రాష్ట్ర సమైక్య ఎండియు ఆపరేటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద వాహన ఆపరేటర్లు ధర్నా చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో 27 వేల మంది కుటుంబాలు రోడ్డున పడతాయని, రేషన్ పంపిణీకి తప్ప ఎండియు వాహనాలు ఎందుకు ఉపయోగపడవని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ధర్నాకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు బదిలీ అమలు కోసమే కూటమి ప్రభుత్వం ఎండియు వ్యవస్థ పై దాడిచేస్తున్నదని అన్నారు. అతి తక్కువ ఖర్చు , వేతనాలతో వాహన సర్వీసు, పెట్రోల్ , రేషన్ తరలింపు ఖర్చు భరించి ప్రజలకు ఇంటింటికీ సకాలంలో పంపిణీ చేస్తున్న వ్యవస్థను రద్దు చేయటం ప్రజల్ని మరింత ఇబ్బందులకు గురిచేయటమే అన్నారు. యూనియన్ జిల్లా గౌరవ సలహాదారు కెవి పవన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకట్రావు, ఉపాధ్యక్షులు బి.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 27వేల మంది కుటుంబాల ఉపాధి పోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కరోనా, తుపాన్, ఇతర విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు రేషన్ అందించామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో

బైరెడ్డిపాలెం పాఠశాల తొలగింపు

- రెండేళ్లు గడుస్తున్నా కొత్త భవనం కోసం స్థలం సేకరించని అధికారులు
- శిథిలావస్థలోఉన్న పాతపాఠశాల భవనమే దిక్కు

ప్రజాశక్తి-భోగాపురం

కార్పొరేట్ సంస్థలకు హోటల్స్ కోసం, ఇతర అవసరాలకు ఎకరాలకు ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం విమానాశ్రయం నిర్మాణంలో భాగంగా తొలగిస్తున్న ఓ పాఠశాలకు అవసరమైన ఐదు నుంచి పదిసెంట్లు భూమిని సేకరించి ఇచ్చేందుకు నిర్లక్ష్యం వహిస్తోంది. విమానాశ్రయానికి వెళ్లేందుకు నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్డులో పాఠశాలను తొలగించాల్సి ఉంది. కాని రెండేళ్ళు గడుస్తున్నా ఈ పాఠశాలకు స్థలాన్ని సేకరించడంలేదు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు అయినప్పటికి స్థలం కేటాయించకపోవడంతో పాఠశాల నిర్మాణానికి ముందడుగు పడడం లేదు. ప్రస్తుతం విమానాశ్రయానికి వెళ్లే అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పాఠశాలను సడన్‌గా తొలగించాల్సి వస్తే గ్రామంలో అద్దెకు కూడా భవనాలు దొరికే పరిస్థితి లేదు. దీంతో ఈ పాఠశాల విద్యార్థులు ఇబ్బందిపడే పరిస్థితులు కనబడుతున్నాయి. ఇది బైరెడ్డిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిస్థితి.

విమానాశ్రయానికి వెళ్లేందుకు జాతీయ రహదారి ఉప్పాడపేట జంక్షను నుంచి రెడ్డిక కంచేరు వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం 6 కిలోమీటర్లు మేర రహదారి పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కంచేరు రెవెన్యూ పరిధిలోని బైరెడ్డిపాలెం గ్రామంలో సేకరించిన భూమిలో అప్రోచ్ రోడ్డు వేసేందుకు

అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో తొలగించనున్న బైరెడ్డిపాలెం పాఠశాల

ప్రభుత్వ పాఠశాల అడ్డంకిగా మారింది. దీనిని పూర్తిస్థాయిలో తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు రెండేళ్ల కిందటే అప్రోచ్ రోడ్డు కోసం భూసేకరణ చేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఈ పాఠశాలకు అవసరమైన భూమిని రెవెన్యూ అధికారులు సేకరించకపోవడం విశేషం. పాఠశాలను ఖాళీ చేయాలని అప్పట్లో పని చేసిన ఆర్‌డిఒ సూర్యకళ పలుమార్లు అధికారులకు చెప్పారు. ఖాళీ చేయాలంటే ముందుగా కొత్త పాఠశాల భవనం నిర్మించాలి. కాని ఇప్పటి వరకు స్థలమే సేకరించ లేదు. ఒకవేళ సడన్‌గా ఖాళీ చేసినా గ్రామంలో భవనాలు కూడా అద్దెకు దొరికే పరిస్థితి లేదు. అధికారులు మాత్ర ఈ పాఠశాల భవనం విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో ఖచ్చితంగా ఈ పాఠశాలను అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం తొలగించే అవకాశం ఉంది. అప్పుడు విద్యార్థులు ఇబ్బంది పడతారని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా స్థలాన్ని సేకరించి కొత్త భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనమే మళ్లీ దిక్కు

వచ్చే ఆర్థిక సంవ్సరం నుంచి ఈ పాఠశాలను తొలగిస్తే పాత పాఠశాల భవనానికి వెళ్లాల్సిన పరిస్థితి కూడా ఉంది. ప్రస్తుతం ఈ గ్రామంలో సుమారు 32 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారు. గతంలో గ్రామంలో పాఠశాల ఉన్నప్పటికి అది శిథిలావస్థకు చేరుకోవడంతో వేరే భవనాలను నిర్మించారు. ఇప్పుడు అవి కూడా విమానాశ్రయం అప్రోచ్ రోడ్డులో తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత పాత పాఠశాల భవనంలో అంగన్‌వాడీ కేంద్రంగా వాడుతున్నారు. ఇందులో 32 మంది విద్యార్థులతో ఐదు తరగతులు నిర్వహించడం కూడా కష్టమే. అందులోను పాత భవనం కావడంతో ఏ క్షణాన కూలిపోతుందో తెలియని పరిస్థితి కూడా ఉంది.

నిధులు మంజూరైనప్పటికీ స్థలం ఇంకా కేటాయించలేదు

విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో ఈ పాఠశాలను అధికారులు తొలగిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన పరిహారం కూడా వచ్చేసింది. కానీ ఇంతవరకు ఇంకా కొత్త పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. కానీ పాఠశాలను అధికారులు ఖాళీ చేయాలని చెబుతున్నారు. అందుకు గ్రామంలోని పాత పాఠశాల భవనంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించాలని అనుకుంటున్నాం.

- ఎం.రమణమూర్తి, ఎంఇఒ, భోగాపురం

గందరగోళంగా క్లస్టర్ మ్యాపింగ్

సచివాలయం ఉద్యోగుల కుదింపునకు కసరత్తు

ప్రజాశక్తి - జామి

విజినిగిరి గ్రామ సచివాలయం

గ్రామాల్లో ప్రజలకు నేరుగా సేవలు ఒదించేందుకు గత వైసిపి ప్రభుత్వం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కానీ కూటమి ప్రభుత్వం సచి వాలయాల క్లస్టర్ మ్యాపింగుతో గందర గోళానికి తెరలేపింది. ఇప్పటి వరకు గ్రామ సచివాలయాల్లో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు అందుబాటులో ఉండేవారు. ఆ గ్రామ కార్యదర్శి సచివాలయం హెడ్‌గా సిబ్బందిని పర్యవేక్షించే వారు. కానీ క్లస్టర్ మ్యాపింగ్ ప్రక్రియతో సిబ్బంది పూర్తిగా కుదించబడతారని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల్లో గతం మాదిరిగా పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. సచివాలయాలు పెరుగుతాయా? లేదా తగ్గుతాయా అన్నదానిపై స్పష్టత లేకపోవడం గమనార్హం. మ్యాపింగ్ పూర్తయితే, కొన్ని సేవలకు పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి తీసుకొచ్చిన సచివాలయం వ్యవస్థను దెబ్బతీసేందుకే కూటమి ప్రభుత్వం ఇటువంటి చర్యలకు తెగబడుతోందని వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు.

మా గ్రామాన్ని క్లస్టర్ నుంచి తప్పిస్తున్నారు

అన్నంరాజుపేట సుమారుగా 4 వేలకు పైగా జనాబా ఉన్నారు. వైసిపి ప్రభుత్వంలో సచివాలయం క్లస్టర్‌గా అన్నంరాజుపేట ఉండేది. అన్ని సేవలకు సంబంధించిన అధికారులు గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉండేవారు. కానీ టిడిపి నాయకులు ఒట్లిళ్లకు చిన్న గ్రామమైన మొకాస కొత్తవలసకు వెళ్లి అధికారులను కలవాలని చెబుతున్నారు. ఇది పెద్ద గ్రామమైన అన్నంరాజుపేటకు తీవ్ర నష్టం.

- ఎన్నింటి విజయ లక్ష్మి, వైస్ ఎంపిపి, జామి

సచివాలయాల మార్పు ఉండదు

క్లస్టర్ మ్యాపింగుతో సిబ్బంది మార్పు తప్పితే, సచివాలయాల్లో గాని, సేవల్లో గాని మార్పు ఉండదు. ఆందోళన చెందల్సిన పని లేదు.

- నీలం అప్పలనాయుడు, ఎంపిడిఒ, జామి

సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

తీరుమారకుంటే వేటు తప్పదు

రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించిన కలెక్టర్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రెవెన్యూ సిబ్బంది తీరు మార్చుకోవాలని, సక్రమంగా పనిచేయకుంటే వేటు తప్పదని కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్‌కె కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.. అర్జీల డిస్పోజ్ చేయడం ముఖ్యం కాదని, పరిష్కారం కావాలని చెప్పారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌కు వచ్చే వినతుల్లో 90 శాతం వరకు రెవెన్యూకు సంబంధినవేనని, రెవెన్యూ అధికారులే ఇందుకు కారణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రీ సర్వేలో వినతులన్నీ వారం రోజుల్లోగా పరిష్కరించాలని చెప్పారు. పనిచేయకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రతిసారీ కాపాడేవారు ఉండరని, తహశీల్దార్లే సక్రమంగా పనిచేయకుంటే కింద సిబ్బంది ఎలా పనిచేస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. విఆర్‌ఒలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయాలని ఆదేశించారు.

గృహ పథకం కింద అందిన దరఖాస్తులను పరిశీలించి, శనివారానికి ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. రీసర్వేలో జరిగిన తప్పిదాలను సవరించాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్‌లో ఒకరి పేరుంటే పొజిషన్‌లో ఇంకొకరు ఉన్నారని, ధ్రువపత్రాలను పరిశీలించకుండా తప్పుగా నమోదు చేశారని మండిపడ్డారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీ, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే

కఠిన చర్యలు

ఆర్‌డిఒ ఆశయ్య

ప్రజాశక్తి-చీపురుపల్లి

స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బి.ఆశయ్య అన్నారు. గురువారం పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం అమలుపై నిర్వహించిన సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ ఈ చట్టం అమలుపై తీసుకుంటున్న చర్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో ఉన్న పురుష సంతాన ప్రాధాన్యత, ఆడపిల్లల పట్ల వివక్షత, మూఢనమ్మకాలు వంటి వివిధ సామాజిక కారణాల దృష్ట్యా కడుపులో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలిస్తే చాలు గర్భస్రావాలు చేయించుకోవడం విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. అందుకే ప్రభుత్వం 0-6 సంవత్సరాలు బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తోందని తెలిపారు. స్కాన్ సెంటర్‌లు లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. చీపురుపల్లి ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సూర్యనారాయణ, ఎస్ఐ లోకేశ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ , స్త్రీ వైద్య నిపుణులు అర్చన, హ్యూమన్ రైట్స్ ప్రతినిది వి. పద్మలత, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం పట్టణం 25వ డివిజన్ (రైల్వే స్టేషన్ రోడ్డు) చెందిన ఆంగుడు నర్సింగరావు అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. వారి ఆర్థిక పరిస్థితి బాగోలేనందున స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా, దానికి స్పందిస్తూ ముఖ్యమంత్రి రూ. 60,441 మంజూరు చేస్తూ చెక్కును పంపించారు. గురువారం ఆ చెక్కును బాధితుడు నర్సింగ రావుకు ఎమ్మెల్యే అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ హెచ్చరించారు. స్థానిక యుద్ధ స్తంభం వద్ద గురువారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయన తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్లాసిక్ సంచులు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిషేధిత ప్లాస్టిక్ ను గుర్తించిన ప్రజారోగ్య అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. గురువారం ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి నేతృత్వంలో ప్రజారోగ్య సిబ్బంది ఉడా కాలనీ పేజ్ 2,3, పాల్ నగర్ ప్రాంతాలలో పర్యటించారు. చుట్టుపక్కల ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ విక్రయం, వినియోగాలపై దాడులు చేపట్టారు.కొన్ని దుకాణాలలో నిషేధిత ప్లాస్టిక్ లభ్యం కావడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు 10 కేజీల వరకు ఉండే ప్లాస్టిక్ బ్యాగులు, ముచ్చులను, సీజ్ చేశారు. ఎంహెచ్ఒ సాంబమూర్తి మాట్లాడుతూ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అర్హులైన వితంతువులు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు కిల్లంపల్లి, రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. గురువారం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ మండల పరిషత్ ఎఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులకు పింఛన్లు మంజూరు చేయడంలో విఫలమైందన్నారు. ముఖ్యంగా భర్తలు చనిపోయిన వితంతువులకు, వృద్ధులకు పింఛన్లు మంజూరు కావడం లేదన్నారు. కొండగుంపాంలో అర్హులైన వారికి ఇంతవరకు పింఛన్లు మంజూరు కాలేదన్నారు. అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయకపోతే భవిష్యత్తులో వామ పక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

25న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేటలో ఈ నెల 25న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సాధన యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలు బోతు దుర్గా ప్రసాద్, పశుమర్తి వెంకటరమణ తెలిపారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 25న జరజాపు పేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నాయన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిర్వహించి వారి ఇళ్లకు వాహనాల్లో తిరిగి పంపిస్తామని తెలిపారు. కంటి రోగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సారా రహితంగా కోదులగుమ్మడ

ప్రజాశక్తి-వంగర

మండలంలోని కోదుల గుమ్మడను సారా రహిత గ్రామంగా అధికారులు ప్రకటించారు. ఈ గ్రామంలో గతంలో నాటుసారా కేసులు నమోదు కావడంతో జిల్లా యంత్రాంగం ఆ గ్రామాన్ని బి - కేటగిరీలో చేర్చింది. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నాటుసారా నివారణకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యాన చర్యలు తీసుకున్నారు. దీంతో గురువారం గ్రామస్తుల సమక్షంలో నాటుసారా రహితంగా గ్రామ దత్తత అధికారి ఎస్ఐ జి.మాన్యాలు ప్రకటించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ జైభీమ్ పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -పూసపాటిరేగ



సభ్యత్వాన్ని అందజేస్తున్నజనసేన నాయకులు శివ

మండలంలోని తిప్పలవలసలో గురువారం జనసేన మండల అధ్యక్షుడు జె.శివ ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యుల కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాలు మేరకు తిప్పలవలస గ్రామ జనసేనపార్టీ సీనియర్ నాయకులు మల్లి గణి, మైలపల్లి యర్రయ్య, మైలపల్లి పైడయ్య ఆధ్వర్యంలో పార్టీ క్రియాశీలక సభ్యుల కిట్లు పంపిణీ చేసామన్నారు. జనసేన నాయకుల, జనసైనికుల, వీర మహిళల కుటుంబాలకు అండగా ఉండేందుకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ ప్రారంభించిన 5 లక్షల రూపాయల జీవిత బీమా, రూ.50వేల ప్రమాద బీమాకి సంబంధించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఐడి కార్డుతో పాటు ప్రశంసా పత్రం క్రియాశీలక సభ్యులకు కిట్లు ద్వారా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భోగాపురం

ఇంటి స్థలాల పట్టాలు ఉన్నప్పటికీ స్థలం చూపించకుండా తహశీల్దార్ ఇబ్బంది పెడుతున్నారని చెరుకుపల్లి గ్రామానికి చెందిన గోక సీతాదేవి ఆరోపించారు. గురువారం ఆమె విలేకర్లుతో మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు చూపించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ తహశీల్దార్ మాత్రం అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దళిత మహిళను అయినందున ఇంతలా ఇబ్బంది పెడుతున్నారని అందుకు ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోకపోవడంతో అమరావతిలోని ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశానని చెప్పారు. ఆమె వెంట టిడిపి నాయకులు రిక్క ఆదినారాయణ, ఉదయ్ కుమార్, తోగులరెడ్డి తదితరులు ఉన్నారు.

పిల్లలకు క్యారమ్ బోర్డు పోటీలు

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగుతుల్లో భాగంగా బుధవారం పిల్లలకు క్యారమ్ బోర్డు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు మహేష్ తెలిపారు. అనంతరం పిల్లలకు కథలు పుస్తకాలు చదవడం, టేబుల్స్ చూడకుండా రాయడం చేశారు. వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి మహేష్ కోరారు.

రీ సర్వే వినతులు వారంలో పరిష్కారం

- నీటి పన్ను వసూలుకు లక్ష్యాలు
- గృహాల స్థలాల క్రమబద్ధీకరణపై రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలి
- రెవిన్యూ అధికారుల సమీక్షలో కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రెవిన్యూ, రీ సర్వే వినతులన్ని వారంలో పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. అర్జీల డిస్పోజ్ చేయడం ముఖ్యం కాదని, పరిష్కారం కావాలని స్పష్టం చేసారు. ప్రతి సోమవారం కలక్టరేట్ కు వచ్చే వినతుల్లో 90 శాతం వరకు రెవిన్యూకు సంబందినవేనని, రెవిన్యూ అధికారులే ఇందుకు కారణమని అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల రెవిన్యూ అధికారులతో కలెక్టర్ అంబేద్కర్ , జేసి సేతు మాధవన్ ఇళ్ళ స్థలాల క్రమ బద్ధీకరణ, అందరికీ గృహాలు, ఇళ్ళ స్థలాల రీ వెరిఫికేషన్, వాటర్ టాక్స్ , ఆన్లైన్ సర్వీసెస్ పెండింగ్ , రీ సర్వే , పిజిఆర్ఎస్ వినతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థలాల క్రమబద్ధీకరణ కోసం గ్రామాల్లో విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. ఆక్రమిత దారులతో దరఖాస్తులు పెట్టించాలని, అందు కోసం విఆర్ఒలు క్షేత్ర స్థాయి లో ఇంటింటికీ సందర్శించాలని తెలిపారు. రెండు రోజుల గడువులో అన్ని గ్రామాలలో పర్యటించి ఆక్రమిత భూముల వివరాలను నమోదు చేయాలనీ సూచించారు. వచ్చే సోమవారం నుండి ఈ విషయం పై వినతులు అందితే సంబంధిత విఆర్ఒపై చర్యలు తీసుకుంటామన్నారు. అందరికీ గృహాలు పథకం కింద జిల్లాలో 6 వేల దరఖాస్తులు అందాయని, వీటిని వెరిఫై చేసి శనివారం నాటికి ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. రీ సర్వే లో జరిగిన తప్పిదాలను సవరించాలని, వెబ్‌లాండ్ లో ఒకరి పేరుంటే పొజిషన్ లో ఇంకొకరి పేరు ఉందని, డాక్యుమెంట్ లను వెరిఫై చేయకుండా తప్పులు తప్పులుగా నమోదు చేసారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రీ సర్వే పై వచ్చిన వినతులను మండల వారీగా జాబితా ఇస్తామని, వాటిని పరిశీలించి వారం లోగా మొత్తం పరిష్కారం అయ్యేలా చూడాలని తెలిపారు. వాటర్ టాక్స్ జిల్లాలో సుమారుగా 10 కోట్ల రూపాయల వరకు వసూలు చేయవలసి ఉండగా కేవలం 53 వేల రూపాయలను మాత్రమే వసూలు చేసారని , ఇక పై వారం వారం లక్ష్యాలను నిర్దేశించాలని జెసికి సూచించారు.

ప్రతి వారం చేసే సిసిఎల్ఎ సమీక్షలో మన జిల్లా పలు రెవిన్యూ అంశాల్లో వెనకబడి ఉందని, ఈ బదిలీల్లో సమర్ధత, పనితీరు ఆధారంగానే బదిలీలు చేస్తామని తెలిపారు. ఎటువంటి సిఫార్సు లను ఆమోదించబోమని, కేవలం పని తీరు ఆధారంగా చేస్తామని, సిఫార్సు చేయించిన వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఇంచార్జ్ డిఆర్ఒ మురళీ, ఇంచార్జ్ ఆర్‌డిఒ వెంకటేశ్వర రావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి రమణ మూర్తి, రెండు నియోజకవర్గాలకు చెందిన తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్ఒలు, డిటి లు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తిచేయాలి

గుంకలాం,కొండకరకాం ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్

కొండకరకాంలో ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 26వ తేదీలోగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేవిధంగా పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. గురువారం గుంకలాం, కొండకరకాం ప్రాంతాలలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలని సిబ్బందికి ఆదేశించారు. త్వరలో జరగనున్న గృహప్రవేశాలకు సిద్ధం చేయించాలని చెప్పారు. అనంతరం కెఎల్ పురంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పేదల ఇళ్ళ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల నిర్మాణాలు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇందుకోసం ప్రతి లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు ఆర్థిక సాయం అందించనున్నదని తెలిపారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ జి. మురళీమోహన్, డిఇ జివి రంగారావు, ఎఇ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు వార్డు పర్యటన

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం మయూరి జంక్షన్ నుండి ప్రారంభమై స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. నాగోజీపేట, తోటపాలెం తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ జీవీ రంగారావు తో కలిసి ఆయన పర్యటించారు. కొన్నిచోట్ల పైప్ లైన్ లీకేజీలను గుర్తించి, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సచివాలయ కార్యదర్శులను మందలిస్తూ ఇకనుండి పైప్ లైన్ లీకేజీలు గుర్తిస్తే శ్రీముఖాలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఇఇ సత్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్పందించారు.. పరిశీలించారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామ దళితులకు శ్మశానవాటిక లేకపోవడంతో అంత్యక్రియలకు పడుతున్న అవస్థలపై ఈ నెల 19న 'ప్రజాశక్తి'లో వచ్చిన 'చెరువు గట్టే శ్మశానం' కథనానికి అధికారులు స్పందించారు. గురువారం సింగరాయి గ్రామానికి ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ వెళ్లి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శ్మశానవాటికకు స్థలాన్ని గుర్తించి, ఉపాధి హామీ ద్వారా అభివృద్ధి చేయాలని ఎపిఒ ఆదిలక్ష్మికి సూచించారు. దహన సంస్కారాలకు ఇబ్బంది కలగకుండా ఉపాధి హామీ నిధుల నుంచి తగు చర్యలు తీసుకునేందుకు సిఫార్సు చేస్తానని చెప్పారు. అంత్యక్రియలకు ఇబ్బంది లేకుండా బోరు ఏర్పాటుచేస్తామని తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయం, వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించారు.

చెరువు గట్టును పరిశీలిస్తున్న అధికారులు

పరిశీలనలో ఇసి జోగారావు, టిఎ ఎర్నమ్మ, శంకర్, రామకృష్ణ, డిఎ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

డెంకాడ ఛానల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

ఛానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

మండలం లోని డి-కొల్లాం చంపావతి నది సమీపంలో ఉన్న డెంకాడ ఛానల్ కాలువను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి గురువారం పరిశీలించారు. ఈ కాలువ ద్వారాచంపావతి నది నుంచి డెంకాడ కు సాగునీరు వస్తుంది. అయితే చంపావతి నది దగ్గర సాగునీరు వచ్చే ఛానల్ దగ్గర పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కాలువ ద్వారా సాగునీరు రావడం లేదు. దీంతో టిడిపి నాయకుడు పానీరాజు ద్వారా డెంకాడ రైతులు ఎమ్మెల్యేకు మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే ఈ కాలువను పరిశీలించి మరమ్మత్తుల కోసం అంచనాలు తయారు చేసి తనకు అందజేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డెంకాడ రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, మండల టిడిపి అధ్యక్షుడు పల్లె భాస్కరరావు ,రైతులు పాల్గొన్నారు

చెరువులో తారక రామ తీర్థ సాగర్ కాలువను తవ్వొద్దు

గుణుపూర్ పేట పెద్ద చెరువులో నుంచి తారకరామ తీర్థ సాగర్ కాలువను తవ్వొద్దని చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే లోకం మాధవికి గురువారం వినతి అందజేశారు. ఎమ్మెల్యే గుణుపూర్ పేట వచ్చిన సందర్భంగా చెరువు వద్ద రైతులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను వివరించారు. తారకరామ తీర్థ సాగర్ కాలువ కోసం గతంలో రైతుల నుంచి భూమిని తీసుకొని వారికి డబ్బులు కూడా చెల్లించారని, ఇప్పుడు ఆ భూములలో ఒక ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి కాలువను చెరువులోకి మార్చేశారని తెలిపారు. ఇప్పటికే చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైందని, అందులో నుంచి కాలువను ఏర్పాటు చేస్తే చెరువు పూర్తిగా పోతుందని అన్నారు. చెరువు కింద ఉన్న సుమారు 15 ఎకరాలు భూమికి సాగునీరు అందక రైతులు నష్టపోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట్లో అలాట్‌మెంట్ ఎలా వచ్చిందో అలాగే తవ్వితే రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు.

కాలువ ఆక్రమణపై రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని చౌడమ్మ అగ్రహారం పంచాయతీ పరిధిలో చరణ్ గ్రూప్ లేఅవుట్ కోసం చెరువు కాలువను కప్పేసారంటూ రైతులు గురువారం డిప్యూటీ తహశీల్దార్ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. తమ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 60.1ఏ, 60.2ఏ, 60.3ఏ, 60.4ఎలో గల భూముల్లో చరణ్ గ్రూప్ వారు లేఅవుట్ వేస్తున్నారన్నారు. ఆ లేఅవుట్ పైన తమ గ్రామానికి చెందిన లక్ష్మణుడు చెరువు ఉందని ఆ చెరువు నుండి బయటికి పోయే సాగునీరు కాలువను కప్పేసి లేఅవుట్ వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై రైతులంతా వెళ్లి లేఅవుట్ ప్రతినిధులను ప్రశ్నించగా కొంతకాలం తర్వాత తీసేస్తామని సమాధానం చెబుతున్నారన్నారు. ఈలోగా వర్షాలు పడితే కాలువ లేకపోవడంతో చెరువు నిండి గ్రామం ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పంట కాలువలను కప్పి పైపులు వేయడం నేరమన్నారు. హైవే స్థలంలో కూడా పైపులు వేసి కాలువను క ప్పేస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ఆయన స్పందించి లేఅవుట్‌లోకి సర్వేయర్‌ని, విఆర్ఒను పంపించి పరిశీలిస్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ పిల్ల అప్పలనాయుడు, జి.జామరాజు, గుడివాడ అప్పల నరసయ్య, జి.రాము, గుడివాడ అప్పలరాముడు, సూర్యనారా యణ, జి.వెంకటరమణ, జి.రమణ, జి.సత్యం, జి.గురు నాయుడు ఉన్నారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.E.P 14/2019, O.S.174/2016

Between:
పొట్నూరు అప్పలరాజు, S/O. జగన్నాధస్వామి, వయస్సు 47 సం.లు డోర్ నెం. 19-75, పెదచాకలి వీధి, బొబ్బిలి మునిసిపాలిటి, విజయనగరం జిల్లా.
......డిక్రీ హెూల్డర్

And:
1. మాధవన్ సుబ్రహ్మణ్య మంజు (died)
2. మాదవన్ సజీంద్రన్, S/o. నాను, వయస్సు 55 సం.లు, డోర్ నెం. 38-52/3, మహారాణిపేట, బొబ్బిలి మునిసిపాలిటి, విజయనగరం జిల్లా.
3. మాదవన్ సంజు, S/o.సజీంద్రన్ వయస్సు 22 సం.లు,-rest do- ....జడ్జిమెంట్ డేటార్స్

(J.Dr nos.2 and 3 are added as per the order in E.A.40/2020, dt:09.11.2021)

పై నెంబరు అమలులో అమలు మొత్తము ఇందలి J.Drs వద్ద నుండి రాబట్టు నిమిత్తం. ఈ క్రింది షెడ్యూల్ దాఖాల ఆస్తిని వేలం వేయిపించి మూలముగా ఇందలి డిక్రీ హెూల్డర్ దాఖలు చేసినందున, సదరు ఆస్తిని తేది: 17.06.2025న ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారినందు బహిరంగ వేలం జరపబడును. కావున ఆసక్తి కలవారు హాజరై వేలం కోర్టువారి షరతులకు లోబడి పాడుకోగలరు.

వేలం షెడ్యూల్ ఆస్తి

District: Vizianagaram Mandal: Bobbili, Town: Bobbili, Street : Phoolbagh Nature of property: One house in a group house D.No.40-147/70 Block No.40, ward No. 14, T.S.No. 180/2G situated towards eastern side of Puspak Mahal.

Boundaries:
East: RCC slabbed house of Vadapalli Rajyalakshmi and Gorle Chandram. **South:** Koneru Gatlu. **West :** Building of Kinthali Hari Krishna and Gopala Krishna. **North:** Boundary wall of Gullipalli Narayana Rao. House no. defendant FF-2 (1st floor - 2) 1/18th common in above mentioned site. Plinth area of defendants house 792-25 sq.ft, total area 27.77 sq.yds.

Boundaries:
East: Corridor **South:** House of Singireddi Radha FF-1 **West :** Open to sky. **North:** House of Rallapalli Subba Rao FF-3

D.Hr.Value : **Rs. 11,00,000/-**
Amin Value: **Rs. 20,00,000/-**

పై ప్రకటన శ్రీ కోర్టువారు ఉత్తర్వులు మేరకు ప్రచురించడమైనది.

ఇట్లు,
గంటి గోపాలకృష్ణ శర్మ
అడ్వకేట్, బొబ్బిలి.
Cell No. 9440192234

Bobbili,
Dt: 23.05.2025

వారంలోనే పరిష్కారం : జెసి

ప్రజాశక్తి-బొబ్బిలి

రెవెన్యూ, రీ సర్వే వినతులన్నీ వారంలో పరిష్కారం కావాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల రెవెన్యూ అధికారులతో జెసి గురువారం సమీక్షించారు. స్థలాల క్రమబద్ధీకరణ కోసం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆక్రమిత దారులతో దరఖాస్తులు పెట్టించాలని, అందుకోసం విఆర్ఒలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లాలని చెప్పారు. రెండు రోజుల గడువులో అన్ని గ్రామాలలో పర్యటించి ఆక్రమిత భూముల వివరాలను నమోదు చేయాలని సూచించారు. వచ్చే సోమవారం నుండి ఈ విషయంపై వినతులు అందితే సంబంధిత విఆర్ఒపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

125 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో ఉపాధిహామీ కింద ఈ ఏడాది 125 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎపిఒ త్రినాథరావు తెలిపారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే 45 ఎకరాలు గుర్తించామని, ఈ నెలాఖరులోగా మిగతా విస్తీర్ణం గుర్తిస్తున్నామని చెప్పారు. 20 పంచాయతీల్లో ఇది వర్తిస్తుందని, ఇందులో భాగంగా మునగ, మామిడి, జీడి, కొబ్బరి, సపోటా, డ్రాగన్ ఫ్రూట్ పండించనున్నామని తెలిపారు. పూలమొక్కల పెంపకం కింద గులాబీలు, మల్లెలు పెంచడానికి ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు కోరారు. ఈ ఏడాది ఆరు వేల మందికి ఉపాధి పనులు కల్పిస్తున్నామన్నారు. ఫారంపాండ్స్, ఎంఐ ట్యాంకులు, రింగ్ ట్రెంచులు, ట్రెంచ్ కమ్ బండ్స్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వేసవిలో పనిచేసే చోట సౌకర్యాల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఇసి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటలు పోటీలు

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.విస్సు, ఆ శాఖా గ్రంథాలయ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేలా పనిచేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- మెరక ముడిదాం

ప్రజా సమస్యలు పరిష్కరించేలా అందరూ పని చేయాలని చీపురుపల్లి ఆర్‌డిఒ బి. ఆశయ్య అన్నారు. గురువారం ఆయన తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. విఆర్ఒలు, విలెజ్ సర్వేయర్లు, తహశీల్దార్ సిబ్బందితో సమావేశమై, మండలంలోని జరుగుతున్న రీసర్వే, ఇతర అన్ని పనులు గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కార్యాలయంలో ప్రజలకు అవసరమైన పనులు పరిస్కారమయ్యే విధంగా పనిచేయాలని తెలిపారు. ఏవిధమైన సమస్యలున్నా తన దృష్టికి తీసుకు రావాలని, ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అజు రఫిజన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడు మృతి

ప్రజాశక్తి-తెర్లాం

ఆటో బోల్తా పడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సాగర్‌బాబు కథనం ప్రకారం.. గరివిడి మండలం కోడూరు గ్రామానికి చెందిన గెడ్డ రామకృష్ణ (20) తెర్లాం మండలం రాజయ్యపేటలోని తన మేనమామ చల్లా ఈశ్వరరావు ఇంటికి ఐదు రోజుల క్రితం వచ్చాడు. అదే మండలం ఎంఆర్ అగ్రహారం గ్రామంలో బుధవారం సాయంత్రం వివాహానికి వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తున్న సమయంలో వెంకటేశ్వర జూనియర్ కళాశాల సమీపంలో ఆటో బోల్తా పడింది. రామకృష్ణపై ఆటో పడటంతో మృతిచెందాడు. ప్రమాద సమయంలో వర్షం పడటం వల్ల ఎవరూ అందుబాటులో లేరు. ఆటోడ్రైవర్ ఒక్కడే ఆటోను పైకి ఎత్తలేక ఆ యువకుడు మృతి చెందాడు. రామకృష్ణ మృతదేహాన్ని బాడంగి సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆటో డ్రైవర్ గెడ్డ రాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఈదురుగాలులతో కూలిన పశువులశాల

ఆవు మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

ఈదురుగాలులతో గురువారం తెల్లవారుజామున ఆరికతోట ఎస్‌సి కాలనీలో పశువుల శాల కూలిపోయింది. దీంతో అందులో ఉన్న ఆవు మృతిచెందింది. పాల విక్రయంతో జీవనం సాగిస్తున్న కడియాల విజయమ్మ.. ఆవు మరణించడంతో ఆవేదన చెందుతున్నారు. అప్పు చేసి కొనుగోలు చేసిన ఆవు మృతి చెందడంతో కుటుంబం వీధిన పడిందని వాపోయారు. విఆర్ఒ శైలజా, పశు వైద్యాధికారి సురేష్ కుమార్ పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వచ్చేలా చూస్తానని తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ చీపురుపల్లి మండలం చీపురుపల్లి గ్రామ కాపురస్తులు (డోర్ నెంబర్:3-310) లేటు బంగారు కృష్ణ రావు గారి కుమారుడు బంగారు రాజేష్ బాబు ఇచ్చిన బోగట్ట ప్రకారం.

నా క్లయింట్ తాలూకా ఈ క్రింది షెడ్యూల్ ధాఖల ఆస్తి క్రయ దస్తా వేజు నెంబర్ 1268/2020 గా చీపురుపల్లి SRO నందు సయ్యద్ రేష్మ బేగమ్ గారి వలన రిజిష్టర్ కాబడినది. సదరు సయ్యద్ రేష్మ బేగమ్ గారికి క్రయ దస్తావేజు నెంబర్ 2031/2015 మూలంగా పెనుమత్స నీలకంట బంగారు రాజు గారి చే రిజిష్టర్ కాబడి దాఖలు పడినది. సదరు పెనుమత్స నీలకంట బంగారు రాజుకి డాక్యుమెంట్ నెంబర్ 131/2008 మూలంగా కుచ్చర్లపాటి వెంకట రమణ రాజు గారిచే రిజిష్టర్ కాబడి దాఖలు పడినది. సదరు కుచ్చర్లపాటి వెంకట రమణ రాజు గారికి క్రయ దస్తావేజు నెంబర్ 996/2006 మూలంగా మీసాల ఏకానంద్ గారిచే రిజిష్టర్ కాబడి దాఖలు పడినది. సదరు మీసాల ఏకనంద్ గారికి దస్తావేజు నెంబర్ 1215/2002 మూలంగా ముదునూరి జగన్నాధ రాజు గారి చే రిజిష్టర్ కాబడి దాఖలు పడినది. ఈ క్రయ దస్తా వేజు నెంబర్లు 2031/2015, 131/2008, 996/2006 & 1215/2002 నా క్లయింట్ తాలూకా క్రింది షెడ్యూల్ ధాఖల ఆస్తి కి లింక్ దస్తావేజులు అయి యున్నవి. తే.03-03-2025న తన బైక్ పై చీపురుపల్లి గ్రామం నుండి రాజాంకు వెళ్తున్న సమయంలో చీపురుపల్లి గ్రామ పరిధి లో ఒరిజినల్ లింక్ దస్తావేజులు నెంబర్లు 131/2008, 996/2006 & 1215/2002 పడిపోయినవి. తదుపరి వెతుకగా దొరకలేదు ఇందు నిమిత్తం నా క్లయింట్ తే.03/04/2025 న చీపురుపల్లి పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా తగిన విచారణ చేసిన తరువాత తే.23/04/2025 న SHO చీపురుపల్లి పోలీసు స్టేషన్ వారు Not Traced Certificate (MLD 012500515798) ద్వారా పడిపోయిన ఒరిజినల్ లింక్ క్రయ దస్తా వేజు నెంబర్లు 131/2008, 996/2006 & 1215/2002 దొరకలేదని నిర్ధారణ చేసి యున్నారు.

కావున ఎవ్వరికైననూ పైన తెలిపిన పడిపోయిన ఒరిజినల్ లింక్ క్రయ దస్తావేజు నెం. 131/2008, 996/2006 & 1215/2002 దొరికినయెడల ఈక్రింది ఆడ్రస్సుకు **7 రోజుల లోపు తెలియపర్చగలరు.** అట్లుకాకుండా ఇతరు లెవ్వరైనా పైతెలిపిన ఆస్థిపై దురుద్దేశ్యపూర్వకము గా ఎట్టి తనఖాలు, క్రయపురోణీలు, లోన్లు, విక్ర యాలు వగైరాలు ఎట్టి అన్యాక్రాంతములు చేయదలచిన యెడల అట్టి వారిపై నాక్లయింటు తీసుకొన బోవు చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు. అట్టివి నాక్లయింటు హక్కులను బంధింపజాలవు.

షెడ్యూలు

విజయనగరం జిల్లా, చీపురుపల్లి మండలం, చీపురుపల్లి గ్రామ పంచాయితీ రెవిన్యూ గ్రామం తాలూకా, సర్వే నెం.139/26 నందుగల 294.00 చ॥గ॥ ఖాళీ స్థలములో నిర్మితమైనటువంటి 1176 చ॥అ॥ ఆర్.సి.సి డాబా (డోర్ నెం. 3-300 దరిలో) ఇల్లున్నూ 64 చ॥ అ॥ లావేట్రి బాత్రూమ్ హద్దులు: తూర్పు: కె. సూర్యనారాయణ గారి డాబా ఇల్లు, దక్షిణం: యమ్. జనార్ధన రావు గారి డాబా ఇల్లు, పశ్చిమం: 20 అడుగల రోడ్డు, ఉత్తరం: రోడ్డు.

Ch. Sankararao,
Advocate, D.No.3-12,
Tirumala Nagar, Behind LIC Office,
Rajam, Vizianagaram, 532127,
Cell : 9491322344